క్లుప్తంగా

పెద్దేరుకు తగ్గిన వరద పోటు



పెద్దేరు జలాశయం

మాడుగుల: మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయానికి రెండు రోజుల నుంచి ఇన్ ఫ్లోగా వస్తున్న వరద తగ్గిందని జేఈ సుధాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. నాలుగు రోజుల క్రితం 500 క్యూసెక్కులున్న ఇన్ ఫ్లో ప్రస్తుతం 60 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, 136.35 మీటర్లకు తగ్గిపోయిందని తెలిపారు.

డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించాలని వినతి



ఇన్‌చార్జి ఏవోకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నర్సీపట్నం: నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించాలని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు పి.గాయత్రి ప్రసన్నలక్ష్మి, జిల్లా నాయకుడు ఎం.చిట్టియ్య ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో రాజ్యలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఉత్తర్వులు మేరకు శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి మే 12, 13, 14 తేదీల్లో ఎన్నికల విధులు నిర్వహించామని, మండల తహసీల్దార్ల ద్వారా డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు.

సభ్య రైతుల వివరాలందించాలి

దేవరాపల్లి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) లావాదేవీలను కంప్యూటరీకరణ చేస్తున్నందున సభ్య రైతులంతా తమ వివరాలను అందించాలని సీఈవో ఎస్. కనకారావు తెలిపారు. స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కె. సరోజకుమార్ ఆదేశాల మేరకు సంఘ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్నామన్నారు. సొసైటీ సభ్య రైతులంతా తమ ఆధార్ కార్డుతోపాటు ఫోన్ నంబర్‌ను సొసైటీకి అందించాలన్నారు.

నీటి సరఫరా నిలుపుదల రేపు

నర్సీపట్నం: మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్న దుగ్గాడ, బలిఘట్టం వాటర్ వర్క్స్ శుభ్రం చేసే నిమిత్తం ఈ నెల 7వ తేదీన పురపాలక సంఘంలోని 28 వార్డులకు తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని కమిషనర్ పి.రవిబాబు సోమవారం తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి మున్సిపాలిటీ వారికి సహకరించాలన్నారు.

వాహనాల వేలం రేపు

మాడుగుల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కె. హనుమంత్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.5 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. పాట దక్కని వారికి తిరిగి ఈ మొత్తం వాపసు చేస్తామన్నారు.

ఆడపిల్లల చదువు సమాజానికి మేలు



మాట్లాడుతున్న ఎంఈవో-2 ఉషారాణి, హెచ్ఎం సుందరి

దేవరాపల్లి: ఆడపిల్లలు చదువుకోవడం ద్వారా కుటుంబంతోపాటు సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని మండల విద్యాశాఖ అధికారి-2 వి. ఉషారాణి తెలిపారు. కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంపై విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆడపిల్లలు ఉన్నత విద్యనభ్యసించి అన్ని రంగాల్లో స్థిరపడి రాణించాలని సూచించారు. సమాజంలో మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆడపిల్లలపై దాడులను ఏవిధంగా ఎదుర్కోవాలి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించారు. ప్రధానోపాధ్యాయిని పీబీటీ సుందరి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

- పైపులైన్ కోసం గోతులు తీసి రోడ్లపైనే మట్టి
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



చిత్తడిగా మారిన కైరళి స్కూల్ వైపు వెళ్లే సిమెంట్ రోడ్డు



బురదమయంగా మారిన తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్లే రోడ్డు

దేవరాపల్లి: చిన్నపాటి చినుకు పడినా దేవరాపల్లిలో సీసీరోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిల పైపులైన్ నిమిత్తం గోతులు తవ్వారు. వాటి నుంచి తీసిన మట్టిని రోడ్లపైన ఇష్టానుసారం వేయడంతో బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఆయా రహదారుల్లో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లే రహదారి మరీ అధ్వానంగా తయారైంది. రోడ్డుపై మట్టి చిన్నపాటి కుప్పలు వేయడంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు సైతం మట్టిరోడ్డును తలపిస్తోంది. దీంతో వ్యవసాయ, విద్యా శాఖ, పాత ఎంపీడీవో భవనం, పశువైద్యశాల, ప్రభుత్వ ఆస్పత్రి, తహసీల్దార్, ఉపాధి హామీ, హౌసింగ్, వెలుగు తదితర కార్యాలయాలకు వెళ్లే అధికారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవరాపల్లి-ఆనందపురం మెయిన్‌రోడ్డు నుంచి కైరళి ఇంగ్లిష్ మీడియం స్కూల్ వైపు వెళ్లే రోడ్డు మరీ అధ్వానంగా మారింది. చిన్నపాటి చిరుజల్లులు కురిసినా సీసీరోడ్డుపై నీటి నిల్వ ఉండిపోయి బురదమయంగా మారుతోంది. ఈ మార్గాన కాలినడకన రాకపోకలు సాగించే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అటుగా ప్రయాణించే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారిలో పలువురు జారిపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై మట్టిని తొలగించి శుభ్రపరచాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎవరిదీ కాంక్రీట్ మిక్సర్...

- ఏళ్ల తరబడి పొదల మాటున వదిలేసిన వైనం..



పిచ్చితుప్పల నడుమ, తుప్పపట్టే స్థితిలో పడి ఉన్న కాంక్రీటు మిక్సర్

చోడవరం రూరల్: అది పది మందికి ఉపాధినిచ్చే యంత్రం... చూస్తే అంతా సరిగా ఉండి పని చేస్తుందన్న రీతిలో ఉన్న మిషన్. అయితే ఏం ఉపయోగం .. ఒకే చోట అదీ పది మంది రాకపోకలు సాగించే రహదారిని ఆనుకుని పిచ్చితుప్పలు పొదలు మాదిరిగా కమ్ముకుని ఏళ్ల తరబడి పడి ఉంది. ఇన్నేళ్లవుతున్నా సరే దీని యజమాని ఎవరన్నదీ ఎవరికీ తెలియని దేవ రహస్యంగా మారింది. ఇదేమైనా చోడవరం పట్టణానికి, పంచాయతీ పెద్దలకు తెలియని చోట ఉందా?! అంటే అదీ లేదు. నగరం నడిబొడ్డున శ్రీనివాస థియేటర్ వెనుక వెంకటేశ్వరుని కల్యాణ మండపానికి వెళ్లే దారిలో పార్కు ప్రహరీని ఆనుకుని, మూలలో ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహానికి చేరువగా రహదారి చెంత ఉంది. ఈ కాంక్రీటు మిక్సర్ మిషన్ చుట్టూ పిచ్చి మొక్కలు పొదలుగా ఎదిగి కమ్మేసి ఉన్నాయి. దీంతో అది కాస్త పని చేయడం మాట అటుంచితే, పాములకు ఆలవాలంగా మారింది. అవి కాస్త ఊరక ఉండక ఆహారం కోసం రోడ్డెక్కితే పరుగులు తీయడం పాదచారులు, పడిపోవడం వాహనదారుల వంతైంది. పోనీ పనికి రాకుండా పోయి ఉంటే పాత ఇనుప సామాన్ల వారికి పడేయ వచ్చుగా, ఏళ్ల తరబడి కాస్తం ఖాళీ జాగా ఉంది కదా అన్న తీరుగా దీని యజమాని ఇక్కడే వదిలేయడం దేనికి అన్నదీ మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. ఏళ్లకేళ్లుగా ఇక్కడే పడి పిచ్చి మొక్కల పాలై, పాములకు ఆలవాలమైన ఈ కాంక్రీటు మిక్సర్ విషయమై స్వంత యజమాని లేరు, రారని అనుకుంటే... పట్టణ పంచాయతీ వారైనా పట్టించుకుని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని, పనిచేసేదైతే వేలాకరిస్తే వారి ఉపాధికైనా ఉపకరిస్తుంది కదా! అని ఆ మార్గాన్ని వాడుకునే వాహనదారులు, పాదచారులతో పాటు ఆర్క్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డి.ఎస్. ప్రసాద్ కోరుతున్నారు. పంచాయతీ వారు పట్టించుకుని, ఆ దిశగా ప్రయత్నిస్తారని ఆశిద్దాం!?

ప్రమాదకరంగా కందిగెడ్డ వంతెన



రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెన ప్రాంతం

కె.కోటపాడు: మండలంలో గవరపాలెం-కె.జె. పురం గ్రామాల మధ్య కందిగెడ్డపై వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ వంతెన నిర్మించి 25 ఏళ్లు గడుస్తున్నా, నేటికీ రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. ఈ వంతెనపై నుంచే కె.కోటపాడు నుంచి విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన సమీపంలో మలుపు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాలను ఒక్కసారిగా అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు తక్షణమే రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



నాతవరం పంచాయతీ శివారు చినజగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



నాతవరం: డి.యర్రవరంలో అవగాహన కల్పిస్తున్న నాతవరం వైద్యాధికారి ప్రసన్న



కె.కోటపాడు: ఎ.భీమవరంలో ర్యాలీ చేస్తున్న సూపర్‌వైజర్ సుశీల, తదితరులు

నాతవరం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. సోమవారం డి.యర్రవరం, నాతవరం పంచాయతీ శివారు చినజగ్గంపేటలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి వీధుల్లో ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు ముర్రుపాలు వెంటనే తాగించాలన్నారు. దీనివల్ల రోగనిరోధిక శక్తి పెరుగుతుందన్నారు. ప్రధానంగా తల్లి పాల ప్రాముఖ్యత చాలా మందికి గ్రామాల్లో తెలియడం లేదన్నారు. అలాంటి వారిలో చైతన్యం తీసుకురావడానికే ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతోపాటు వైద్య పరంగా అందించే సూచనలు విధిగా పాటించాలన్నారు. గ్రామాల్లో చాలామంది మూఢనమ్మకాలు పాటించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటికి స్వస్తి పలకాలన్నారు. నాతవరం, వై.డి.పేట సెక్టార్ల సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రసన్న, రాజేశ్వరి, సత్యవతి, వరలక్ష్మి, ఏసురత్నం, వసంత, వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు: తల్లి పాలలోనే అధిక పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. ఎ.భీమవరంలో సోమవారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లి పాల విశిష్టతను వివరించడంతోపాటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన అరగంట వ్యవధిలోనే తల్లిపాలను బిడ్డకు ఇవ్వాలని సుశీల తెలిపారు. ఆర్నెల్లపాటు తల్లిపాలను ఇవ్వడంతోపాటు బిడ్డకు రెండేళ్లు వచ్చేంత వరకూ అనుబంధ ఆహారాన్ని అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త శివలక్ష్మి పాల్గొన్నారు.

బొత్సకు మండల నాయకుల సంఘీభావం



బొత్సకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ మండల నాయకులు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణకు పార్టీ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. సోమవారం చోడవరంలో సమావేశానికి హాజరైన ఆయన్ను ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జిల్లా యువజన సంఘం కార్యదర్శి జోగా కొండబాబు, తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు, మాజీ అధ్యక్షుడు కె. అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, ఎంపీటీసీలు గోకివాడ రాము, కోరుకొండ లీలావతి రమణ, సర్పంచ్‌లు, నాయకులు బల్లిన అమ్ము నాయుడు, పెదిరెడ్ల మాణిక్యం, గోపిశెట్టి శ్రీను, బోయిన నారాయణమూర్తి తదితరులు కలిశారు. బొత్స విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధనకు కృషి

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కుల, మత, జాతి, వర్ణ లింగ భేదాలు లేకుండా అందరూ కృషి చేయాలని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు పిలుపునిచ్చారు. వెనుకబాటుతనం, సహజ వనరుల దోపిడి నుంచి ఉత్తరాంధ్రను కాపాడుకోవాలంటూ కలెక్టరేట్ గేటు వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాయలసీమ పెత్తందారులు వద్దు, ఉత్తరాంధ్రే మనకు ముద్దు నినాదంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో, విభజిత రాష్ట్రంలో పెత్తందార్ల చేతుల్లోనే రాజ్యాధికారం ఉందని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేలా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు డీఆర్వోకు వినతి పత్రం అందించారు.

సహారా ఇండియా సొమ్ము చెల్లించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: సహారా ఇండియా సొమ్మును లబ్ధిదారులకు తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి బీటీ దొర అధ్యక్షతన సోమవారం సీఐటీయూ కార్యాలయంలో పార్టీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల కోసం పైసా పైసా కూడబెట్టి సహారా ఇండియాలో పొదుపు చేస్తే సంస్థ మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి లబ్ధిదారులకు డబ్బులు పంపిణీ చేసి న్యాయం చేయాలని కోరారు. లేదంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నగదు చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పేదల ఉసురు తగులుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్. దేముడు, డి. శంకర్, కె. ఈశ్వరరావు, జె.ఈశ్వరరావు, బి. నాగేశ్వరరావు, వి. దొంగబాబు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



గ్రామ ప్రధాన కూడలిలో సాంస్కృతిక కార్యక్రమం

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ ప్రధాన ఇలవేల్పు మోదకొండమ్మ పండగ ఆదివారం అర్ధరాత్రి ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ప్రజా ప్రతినిధులు, నాయకులు దర్శించుకున్నారు. పండగ సందర్భంగా గ్రామంలో వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన ఏడు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. పండగను విజయవంతం చేసిన గ్రామస్తులకు ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించాలని ఫిర్యాదు



ఎంపీడీవో రాంబాబుకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ అప్పలనర్స

నాతవరం: ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ ఉల్లంఘించి గ్రామాల్లో దర్శనమిస్తున్న టీడీపీ కటౌట్లు, ఫ్లెక్సీలను అధికారులు తొలగించడం లేదని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో జాగరల రాంబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. నాతవరం మండలంలో ఏ గ్రామంలో చూసినా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇతర టీడీపీ నేతలు ఫొటోలతో కూడిన కటౌట్లు, ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయన్నారు. వీటిని తొలగించాలని గ్రామస్థాయిలో అధికారులకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. నాతవరం ఉపసర్పంచ్ కరక అప్పలరాజు, డి.యర్రవరం, గుమ్మడిగొండ, పెదగొలుగొండపేట, ఎం.బెన్నవరం ఎంపీటీసీలు ఇనపసప్పల పుష్ప, సుర్ల అచ్చియ్యనాయుడు, తమరాన సత్యనారాయణ, తమరాన లోవకృష్ణ, నాతవరం గ్రామ కమిటీ నాయకుడు చిటికెల రామకృష్ణ పాల్గొన్నారు.

కోడ్ ఉన్నంత వరకు జాగ్రత్త



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో అధికారులంతా జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో జాగరల రాంబాబు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికయ్యేంత వరకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు విధిగా అమలు చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలన్నారు. వర్షాలు పడుతున్నందున రోగాలు వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలో భాగంగా డ్రైనేజీలు శుభ్రం చేయాలన్నారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. సచివాలయానికి వివిధ పనులు మీద వచ్చే ప్రజల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరించొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



నాట్లు వేయటంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీదేవి, తదితరులు

నర్సీపట్నం: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ టి.శ్రీదేవి రైతులకు సూచించారు. సోమవారం ధర్మసాగరంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులకు వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడిలో 30 మంది రైతులకు 14 వారాల పాటు యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇస్తామన్నారు. వరినాట్లు వేసింది మొదలు కోత కోసే దశ వరకు శిక్షణ ఉంటుందన్నారు. మేలైన వ్యవసాయ పద్ధతుల సర్టిఫికెట్ ఉండడం వల్ల ధాన్యం ఎక్కువ రేటుకు అమ్మకం చేసుకోవచ్చన్నారు. ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, నీటి, పంటపై వచ్చుతెగుళ్లు, వరిలో వచ్చే పురుగుల యాజమాన్యంపై శిక్షణ ఇస్తామన్నారు. జలవనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్‌రావు మాట్లాడుతూ పొలంబడి ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం, నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు. పంటలో మిత్ర పురుగులు, శత్రు పురుగులను గుర్తించడం, క్రమం తప్పకుండా వారం వారం చేను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు అప్పారావు, చిరంజీవి పాల్గొన్నారు.

అవయవదానంతో పలువురికి ప్రాణం



బుచ్చెయ్యపేట: వడ్డాది స్కూల్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



మాడుగుల రూరల్: జి. అగ్రహారం హైస్కూలులో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

బుచ్చెయ్యపేట: అవయవదానంతో మరెందరికో ప్రాణాలు పోసినవాళ్లం అవుతామని ప్రధానోపాధ్యాయుడు టీవీ శేషగిరిరావు తెలిపారు. అవయవదాన దినోత్సవం సందర్భంగా సోమవారం వడ్డాది మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మనిషి మరణానంతరం అవయవ దానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి మరణించిన వ్యక్తి అవయవాలు ఏర్పాటు చేయడం వల్ల వారికి పునర్జన్మ కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 26న సంఘ సేవకురాలు మదర్ థెరిసా 114వ జయంతి సందర్భంగా పలు గ్రామాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని అతిథి దేవోభవ సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు టేబుల్, గ్రైండర్ తదితర బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. మదర్ థెరిసా జయంతి వేడుకల కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

జి. అగ్రహారం పాఠశాలలో అవయవదాన దినోత్సవం

మాడుగుల రూరల్: జి. అగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూలులో సోమవారం అవయవదాన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం వి. ఉమాశంకర్ మాట్లాడుతూ అవయవ దానంతో ఎందరికో పునర్జన్మ ఇవ్వవచ్చునని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, కంటిలోని కార్నియా, కిడ్నీలు, ప్రాంకియాస్, గుండె కవాటాలు, చర్మం, ప్రేగులు, రక్తనాళాలు, వంటి శరీర భాగాలు బొమ్మలను కార్డుబోర్డులపై రాయించి, చూపించి, వాటి ఉపయోగాలును వివరించారు. వడ్డాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏల నిరసన



ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

చీడికాడ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్.దేముడునాయడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వీఆర్‌ఏలకు శ్రమకు తగిన వేతనం లేదన్నారు. ఎదుగులేని ఉద్యోగులుగా మిగిలిపోతున్నారని, వీరికి నైట్ డ్యూటీలు వేస్తున్నారని వాపోయారు. పలు సేవలందిస్తున్న వీరి సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అర్హులైన వీఆర్‌ఏలను అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్వోలుగా పదోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కనీస వేతనం కల్పించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నేతలు నాగేష్, తాతబాబు, రమణ, ప్రసాద్, నాయుడు, రమణమ్మ, గణేష్ పాల్గొన్నారు.